సాక్షి
నాగర్‌కర్నూల్
సోమవారం। 31 । జూలై। 2023



మున్సిపాలిటీలో ఒకేఒక్కడు
జడ్చర్ల మున్సిపాలిటీ సిబ్బంది కొరతతో సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది.

వివరాలు 8లో ▶



శాంతించిన కృష్ణమ్మ
ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది.

వివరాలు 8లో ▶

వాతావరణం
గరిష్టం/కనిష్టం
29.2 /23.3

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉద్యమిద్దాం'



స్టేషన్ మహబూబ్‌నగర్: దేశంలో మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా కలిసి ఐక్యంగా పోరాడదామని హైకోర్టు రిటైర్డ్ జడ్జి బి.చంద్రకుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ముస్లిం సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ముస్లిం డిక్లరేషన్ సభ నిర్వహించారు. ఇందులో ముఖ్యవక్తగా పాల్గొన్న జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ కార్పొరేట్లకు లాభం చేకూరుస్తున్నారన్నారు. దేశంలో లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. కేసీఆర్ రాష్ట్రంలోని అన్నివర్గాలను మోసం చేశారని ఆరోపించారు. కేంద్రంలోని పలు బిల్లులకు కేసీఆర్ మద్దతు పలికారని, బీజేపీ- బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని దుయ్యబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్‌కు ఏటీఎంలా మారిందని కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా మాట్లాడుతున్నారని, మరి సీబీఐ, ఈడీలచే ఎందుకు విచారణ చేయించడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలను ఓడించాలని, మైనార్టీలు తమ హక్కుల కోసం ఉద్యమించాలని కోరారు. ముస్లిం సంఘాల జేఏసీ కన్వీనర్ ఎండీ సలీం, కోకన్వీనర్ సైకిబాబ మాట్లాడుతూ ముస్లింలకు కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని విమర్శించారు. ఎన్నో సమావేశాలు నిర్వహించి 22 అంశాలతో కూడిన ముస్లిం డిక్లరేషన్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ ఎంపీ సీటును ముస్లింలకు కేటాయించాలని ఫారుఖ్ హుస్సేన్ తీర్మానం చేయగా ఆమోదం తెలిపారు. అనంతరం ముస్లిం డిక్లరేషన్ బుక్‌లెట్‌లను ఆవిష్కరించారు. సమావేశంలో పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, ఎండీ అన్సారీ, యూనుస్ పర్వేజ్ తదితరులు మాట్లాడారు.

'పాలమూరు ఎక్కడ పచ్చబడింది'



పాలమూరు: బీఆర్ఎస్ మంత్రులు చెబుతున్నట్లు పాలమూరు ఎక్కడ పచ్చబడిందో చెప్పాలని బీజేపీ నేత, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి చేయకుండా, అవసరమైన మేర సాగు నీరు ఇవ్వకుండా పాలమూరు పచ్చబడిందనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మహబూబ్‌నగర్‌లోని ఆయన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇళ్లు లేని వారికి డబుల్ బెడ్‌రూం నిర్మించి ఇస్తామని మాట ఇచ్చి విస్మరించారని ఎద్దేవా చేశారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో 30- 35 వేల మంది డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుంటే.. 3,250 ఇళ్లు మాత్రమే నిర్మిస్తే ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. పూర్తయిన ఇళ్లను సైతం లబ్ధిదారులకు ఇవ్వడం లేదని ఆరోపించారు. తెలంగాణను డల్లాస్ చేస్తానని చెప్పి.. పూర్తిగా ఖల్లాస్ చేశారని, వరంగల్‌ను ఇస్తాంబుల్ చేస్తానని.. వరద నీటిలో ముంచారని ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వ పాలనలో ఎవరైనా ఉద్యోగులు, ప్రజలు సంతోషంగా ఉన్నారా అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సోమవారం మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రానికి వస్తున్నారని జితేందర్‌రెడ్డి చెప్పారు.

జోగుళాంబ ఆలయ అభివృద్ధికి ప్రణాళిక

జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాలలో అయిదో శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలలో వీలైనంత తక్కువ సమయంలో చేయగలిగే అభివృద్ధి పనులపై ఆదివారం ఆలయ ఈఓ పురేందర్, చైర్మన్ చిన్నకృష్ణయ్య, ధర్మకర్త నరసింహారెడ్డి సమాలోచనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి సంబంధించిన ఉత్సవాలలో ఉపయోగించే వాహన సేవల తయారీకి భక్తుల సహకారంతో చేయగలిగిన వాహనాలపై చర్చించారు. అలాగే భైరాపురం, బస్వాపురం దగ్గర ఏర్పాటు చేయాల్సిన బసవేశ్వరుడు, మహా లింగం రాతి విగ్రహాలకు సంబంధించి సంబంధిత శిల్పులు, స్థపతిని పలిపించి ఎస్టిమేషన్స్ తీసుకున్నారు. పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్.. యోగనారసింహ స్వామి, సూర్యనారాయణ స్వామి ఆలయాల అభివృద్ధి చేపట్టేందుకు చేసిన ఆదేశాల మేరకు ప్రైవేటు సర్వేయర్‌ను పలిపించి ఆలయాలకు సంబంధించిన ఖాళీ స్థలాలపై సర్వే చేసి నివేదికల తయారీకి సిద్ధమయ్యారు. పాత ఆసుపత్రి భవనం చుట్టూ పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని ఆదేశించారు.

మిల్లర్లపై కత్తి..!

సీఎంఆర్ బియ్యం తిరిగి ఇవ్వడంలో తీవ్ర నిర్లక్ష్యం

వంగూర్ మండలంలోని ఓ గ్రామ శివారులో 2020–21 ఆర్థిక సంవత్సరంలో నూతనంగా మిల్లును ప్రారంభించారు. ప్రభుత్వం సీఎమ్మార్ (కస్టమ్ రైస్ మిల్లింగ్) కింద 2022లో వడ్లను కేటాయించింది. బహిరంగ మార్కెట్‌లో వడ్లకు ఎక్కువ ధర ఉండటంతో అక్రమంగా విక్రయించేశారు. ఆ సొమ్ముతో అందరు భాగస్వాములు కలిసి రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టారు. తాజాగా జిల్లా అధికారులు సీఎమ్మార్ పెట్టాలని ఒత్తిడి తేవడం.. అటు రియల్ ఎస్టేట్ అనుకున్నంతగా కలిసిరాకపోవడం.. మర ఆడించేందుకు వడ్లు లేకపోవడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి. అధికారుల లెక్కల ప్రకారం ఈ మిల్లు నుంచి సీఎమ్మార్ కింద సుమారు రూ.25 కోట్ల నుంచి రూ.30 కోట్ల విలువైన బియ్యాన్ని ఇవ్వాల్సి ఉందని సమాచారం.



కల్వకుర్తిలోని మిల్లులో బియ్యాన్ని పరిశీలిస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారులు (ఫైల్)

- బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని అధికారుల హెచ్చరిక
- బయటి మార్కెట్‌లో వడ్లకు అధిక ధర.. వేల టన్నులు పక్కదారి
- ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేందుకు బియ్యం లేక మిల్లర్లలో అయోమయం
- మూడేళ్లలో పత్తాలేని 54వేల మెట్రిక్‌టన్నుల సీఎంఆర్

కల్వకుర్తి టౌన్: ప్రభుత్వం వానాకాలం, యాసంగి సీజన్లలో రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని (వడ్లను) జిల్లాలోని పలు మిల్లర్లతో పాటుగా, ఇతర జిల్లాలకు బియ్యంగా మార్చి ఇచ్చేందుకు (కస్టమ్ రైస్ మిల్లింగ్) కేటాయించారు. ఇలా కేటాయించిన బియ్యాన్ని తిరిగి మరాడించి ప్రభుత్వానికి అప్పజెప్పాలి. గత రెండేళ్లుగా రెండు సీజన్‌లలో వచ్చిన వడ్లను మిల్లర్లకు కేటాయించగా.. వాటిని ఇప్పటివరకు తిరిగి ప్రభుత్వానికి అందించలేదు. ప్రభుత్వానికి మిల్లర్లు బియ్యాన్ని ఇవ్వకపోవటంతో ప్రభుత్వం మిల్లర్లకు 25శాతం జరిమానాను విధించి, అందుకు సంబంధించిన బియ్యాన్ని ఇవ్వాలని ఆదేశాలిచ్చారు. ఆదేశాలిచ్చినా జిల్లాలోని అధికారులు అందుకు ఒత్తిడి తెస్తూనే, బియ్యాన్ని ఇవ్వాలని మిల్లర్లను లోలోపల బతిమాలుతున్నారు. గడిచిన మూడేళ్ల నుంచి సుమారుగా 54వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇవ్వాల్సి ఉన్నా అధికారులు మాత్రం ఇతర కారణాలను చూపుతూ అంతేమీ లేదు, చాలావరకు బఫర్‌స్టాక్ ఉందని రికార్డులలో నమోదు చేస్తుండటం గమనార్హం. అసలు మిల్లర్లకు కేటాయించిన వడ్లను బహిరంగ మార్కెట్‌లో అధిక ధర ఉండంతో వాటిని అమ్ముకోవటంతో, అసలు వడ్లే లేకపోవటం బియ్యాన్ని ఎలా ప్రభుత్వానికి ఇస్తారో అన్న అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

వడ్లు లేక.. బియ్యం రాక

జిల్లాలోని సుమారు 100 మిల్లుల నుంచి ఇప్పటికే సీఎమ్మార్‌ను ఇవ్వాలని అధికారులు ఒత్తిడి పెంచుతున్నారు. 2023లో కేటాయించిన సీఎమ్మార్ వడ్లు బహిరంగా మార్కెట్‌లో రూ.2700 వరకు క్వింటా పలకటంతో మిల్లర్లు వాటిని దారి మళ్లించి సొమ్ము చేసుకున్నారు. వాటి స్థానంలో ఇతర ప్రాంతాల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వానికి లెక్క చూయించారు. కోవిడ్ సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్‌బియ్యాన్ని అధికంగా ఇవ్వటంతో అప్పటివరకు సీఎమ్మార్ కథ బాగానే నడిచింది. ప్రభుత్వాలు అదనపు బియ్యాన్ని ఇవ్వటం మానేశాక మిల్లర్లకు తిప్పలు తప్పలేదు. జిల్లాలో 2021–2022 ఏడాదిలో ఇంకా 8 మిల్లర్ల నుంచి 2వేల మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. బియ్యాన్ని సర్దుబాటు చేయలేక చాలా మంది మిల్లర్లు ఛత్తీస్‌ఘడ్, బీహార్ లాంటి ప్రాంతాల నుంచి బియ్యాన్ని తెప్పించి అడ్జస్ట్ చేస్తున్నారు. తక్కువగా ఇచ్చే వాటిని మాత్రమే అధికారులు బయటకు చెబుతున్నారే తప్ప, రాని బియ్యాన్ని బయటకు చెప్పటం లేదనే వాదనలు చాలానే ఉన్నాయి.

అధికారుల అండతోనేనా..

జిల్లాలో ప్రస్తుతం 11 పారాబాయిల్డ్, 89 సాధారణ మిల్లులు ఉన్నాయని అధికారుల ద్వారా తెలుస్తోంది. 2023 ఏడాదిలోనే ఏకంగా 18 నూతన మిల్లులు ఏర్పడ్డాయంటే ఇందులో సంబంధిత అధికారుల అండతోనే నూతనంగా వాటిని ప్రారంభించినట్లు సమాచారం. అధికారుల అండదండలు మిల్లర్లకు ఉండటంతోనే సీఎమ్మార్‌ను కేటాయిస్తున్నారని బహిరంగంగానే విమర్శలు ఉన్నాయి. బియ్యాన్ని ఇవ్వని మిల్లర్లకు ధాన్యం కేటాయించవద్దని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా.. కొందరు అధికారులు వాటిని పెడచెవిన పెడుతూ ధాన్యం కేటాయించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

25 శాతం అదనంగా ఇవ్వాలి



జిల్లాలోని చాలా మంది మిల్లర్లు సీఎమ్మార్‌ను సకాలంలో ఇవ్వకపోవడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు 25శాతం జరిమానాను విధించాం. మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యంతో పాటుగా 25 శాతం అదనంగా ఇవ్వాలి. సెప్టెంబర్‌లోగా సీఎమ్మార్ ఇవ్వకపోతే మరింత జరిమానా విధించే అవకాశం ఉంది. మిల్లర్లు సకాలంలో వారి సీఎమ్మార్‌ను ప్రభుత్వానికి అందజేయాలి.

– బాలరాజు, మేనేజర్, జిల్లా పౌరసరఫరాల శాఖ



కల్వకుర్తిలోని ఓ మిల్లులో మరాడించిన బియ్యం

జిల్లాలో 2021-22 సీఎమ్మార్ వివరాలు	ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం	ధాన్యం విలువ	ఇవ్వాల్సిన సీఎమ్మార్	ఇప్పటివరకు ఇచ్చింది	పెండింగ్ సీఎమ్మార్
	1.22 లక్షల మెట్రిక్ టన్నులు	రూ.239.71 కోట్లు	81,944 మెట్రిక్ టన్నులు	79,888 మెట్రిక్ టన్నులు	2,056 మెట్రిక్ టన్నులు

'మెడిసిన్ స్టోర్' నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి



సెంట్రల్ మెడిసిన్ స్టోర్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

బిజినేపల్లి: మండలంలోని పాలెం పీహెచ్‌సీ కేంద్రం వద్ద సెంట్రల్ మెడిసిన్ స్టోర్ నూతన భవనానికి ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. దాదాపు రూ.3.60 కోట్లతో మంజూరైన ఈ భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుధాకర్‌లాల్, ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, సర్పంచు లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.5కోట్లు మంజూరు

నాగర్‌కర్నూల్: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కమ్యూనిటీ హాల్ భవనాలు నిర్మించడానికి, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్లు నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం కేసీఆర్‌ను కోరిన వెంటనే స్పందించి రూ.5 కోట్లు మంజూరు చేస్తూ జీవో నెంబర్ 299 విడుదల చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. గత రెండు నెలలో రూ.105కోట్లకు పైగ నిధులు మంజూరు చేయడమే కాకుండా,ఇప్పుడు మరో రూ.5కోట్లు మంజూర్ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం



లింగాలలో ప్రజలతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ

లింగాల: కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వ ఏర్పాటుతోనే పేదల సంక్షేమం సాధ్యమని.. రాబోవు ఎన్నికల్లో పార్టీని ఆదరించాలని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని 14 వార్డులలో హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఐసీసీ ముఖ్యనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ ఇచ్చిన రైతు, యూత్ డిక్లరేషన్‌తో పాటు ఇతర హామీలు రూ. 2 లక్షల రుణమాఫీ, పక్కా ఇండ్ల నిర్మాణాలు అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలన కొనసాగిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని, ఎన్నికలు సమీపిస్తుండగా మరోసారి మభ్యపెట్టి అడ్డదారిలో గెలవాలని చూస్తున్నారని విమర్శించారు. తమకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ లింగమ్మ, నారాయణగౌడు, మండల పార్టీ అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, లింగాల, అచ్చంపేట యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్‌రాథోడ్, అజయ్‌యాదవ్, వంగూర్ మండల పార్టీ అధ్యక్షులు పండిత్‌రావు, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు కొండల్‌రావు, లక్ష్మణ్‌నాయ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



గుండూర్‌లో గుంటుకను తోలుతున్న ఎంపీ రాములు

కల్వకుర్తి రూరల్: మండలంలోని గుండూర్‌లో ఎంపీ రాములు ఆదివారం పర్యటించారు. గ్రామంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనుల వివరాలపై ఆరా తీశారు. నూతనంగా నిర్మిస్తున్న పల్లెద వాఖానా, జిల్లా పరిషత్ పాఠశాలలో వంటగది, వెటర్నరీ దవాఖానా నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. అనంతరం గ్రామంలో రైతులతో కలిసి పత్తిచేనులో గుంటుకను తోలారు. సర్పంచ్ కృష్ణారెడ్డి, పంచాయతీ సెక్రటరీ వీరస్వామి ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

అమ్రాబాద్: ఆపదలో ఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని ఎంపీ పోతుగంటి రాములు అన్నారు. పదర మండలంలోని ఇప్పలపల్లికి చెందిన తులసీరామ్‌కు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 60 వేల చెక్కును ఆదివారం హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో అందజేశారు. గతంలో ఏ సీఎం అందించని విధంగా సహాయం అర్థించిన ప్రతి ఒక్కరికీ సీఎం కేసీఆర్ సహాయం అందిస్తున్నాడని తెలిపారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి



మణిపూర్ మృతులకు సంతాపం తెలుపుతున్న కవులు

కందనూలు: మణిపూర్‌లో నెలకొన్న హింస, దమనకాండకు పాల్పడ్డ వారిపై చర్య తీసుకొని శాంతిని నెలకొల్పేలా కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పెబ్బేటి మల్లికార్జున్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఎస్ఆర్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక, తెలంగాణ సాహితి, వెన్నెల సాహిత్య అకాడమీ, తెలంగాణ అరసం సంయుక్త ఆధ్వర్యంలో మణిపూర్ దమనకాండపై కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ కవిసమ్మేళనానికి ఆయన సభాధ్యక్షత వహించి మాట్లాడారు. మణిపూర్‌లో జరిగిన సంఘటన దేశ సమగ్రతకు మచ్చ లాంటిదని, బలహీన వర్గాలవారిని, గిరిజనులను, అమాయక ప్రజల్ని హింసించడం అమానవీయమని అన్నారు. జిల్లా కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షుడు డి.రాములు మాట్లాడుతూ.. మణిపూర్‌లో చోటుచేసుకున్న ఘటనలు అమానవీయమని, దేశానికే అవమానకరమని అన్నారు. మనుషులను,మనుషులుగా చూడని సమాజంలో మనం బతుకుతున్నందుకు సిగ్గుపడుతున్నామని తెలిపారు. అంబేద్కర్ ఐడియాలజీ కార్యదర్శి శోభన్‌బాబు మాట్లాడుతూ.. ఆ రాష్ట్రంలోని అభరణాలు, గనులను దోచుకోవడానికి, వ్యాపారాల చాటున కొందరు సాగిస్తున్న దుర్మార్గాలను ఆపి నిందితులను శిక్షించాలన్నారు. మణిపూర్‌లో సాధారణ స్థితి కల్పించడంతోపాటు శాంతిని నెలకొల్పాలని కోరుతూ... కవులు తమ కవితలు, పాటల ద్వారా కవితా గానం చేశారు. అనంతరం మృతుల ఆత్మకు శాంతికలగాలని రెండు నిముషాలు మౌనం పాటించారు. ఈ కవిసమ్మేళనంలో అర్కల రాజేష్, ఎదిరేపల్లి కాశన్న, బోనాసి తిరుపతయ్య, కాశీ దాస్, రూప, కల్వకోలు మద్దిలేటి, ముచ్చర్ల దినకర్, కందికొండ మోహన్, వనపట్ల సుబ్బయ్య, భానుచందర్, వల్లభాపురం జనార్దన్, ప్రమోద్ కుమార్, రాజశేఖర్ కవులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి

- రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పక్కన కలెక్టర్ రవినాయక్, ఎస్పీ కె.నరసింహ తదితరులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషిచేస్తుందని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి మంత్రి హాజరై మాట్లాడారు. అందరికీ విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎన్నో హాస్టళ్లలో ఏర్పాటు చేసిందని, చదువుతోపాటు పారిశ్రామిక రంగంలో రాణించడానికి విద్య, వైద్యం అందుబాటులోకి తెచ్చిందన్నారు. దళితబంధు, పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రత్యేక అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు. ప్రపంచంలోనే ఎత్తైన బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం, అలాగే సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడం, అంబేద్కర్ అడుగుజాడల్లో ఈ ప్రభుత్వం ఉందని చెప్పడానికి నిదర్శనం అన్నారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులకు సంబంధించిన కేసుల విషయంలో నష్టపరిహారం వెంటనే అందేవిధంగా చూడాలన్నారు. రాష్ట్రంలో 2014 కన్నా ముందు చాలా ఇబ్బందులు ఉండేవని, వివిధ అంశాలపై ప్రజలను చైతన్యం చేయడం వలన సమస్యలు తగ్గాయన్నారు. అధికారులు మానవీయ కోణంలో సమస్యలు పరిష్కరించాలని సూచించారు. జనవరి నుంచి జూన్ వరకు కేసులకు సంబంధించి కుల ధ్రువపత్రాల జారీ, ఎక్స్‌గ్రేషియా, బెనిఫిట్స్ తదితర అంశాలపై కలెక్టర్ రవినాయక్ వివరించారు. ఎస్సీ, ఎస్టీ కేసులలో వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు, చట్టాల ప్రకారం సంబంధిత కార్యక్రమాలు చేస్తున్నామని, ప్రభుత్వ సూచనలు పాటిస్తున్నామని ఎస్పీ కె.నరసింహ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ యాదయ్య, ఏఎస్పీ రాములు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటలకు ప్రోత్సాహం

- ఉచితంగా మొక్కలు.. సబ్సిడీపై డ్రిప్ ఏర్పాటు
- ఉపాధి హామీలో భాగంగా ఉద్యాన పంటల సాగుకు పెద్దపీట
- నేటితో ముగియనున్న గడువు




కందనూలు: ఉపాధిహామీ పథకం కింద ప్రభుత్వం పండ్లతోటల సాగుకు ప్రోత్సాహం అందించాలని నిర్ణయించింది. కూరగాయలు, పండ్లు, ఇతర ఉద్యాన పంటలకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రాయితీలతో కూడిన ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఐదెకరాల భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ,చిన్న,సన్నకారు రైతులకు ఈ పథకంలో అవకాశం కల్పిస్తారు. నీటి వనరులు ఉన్న రైతులు వరిసాగు చేస్తుండడంతో జిల్లాలో ఏటా సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. దీంతో వరికి ప్రత్యామ్నాయంగా అధిక ఆదాయాన్ని ఇచ్చే పండ్లు, ఉద్యాన పంటలను ప్రోత్సహించి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా రాయితీలు ప్రకటించింది.

2,565 ఎకరాల్లో సాగే లక్ష్యం

జిల్లాలో 2565 ఎకరాల్లో ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాది ఉద్యాన పంటల సాగుకు ప్రణాళిక రూపొందించారు. నేలల రకాలు, వనరులను పరి గణలోకి తీసుకొని అవకాశం కల్పిస్తారు. ఈ మేరకు మామిడి, జామ, సపోటా, దానిమ్మ, సీతాఫలం, మునగ, డ్రాగన్ ఫ్రూట్ తో పాటు ఇతర పండ్లను సాగు చేయించాలనేది అధికారుల లక్ష్యం. కూలీల ఖర్చు, మెటీరియల్, డ్రిప్ పరికరాలపై రాయితీని అన్ని పంటల ఎకరం చొప్పున పరిగణనలోకి తీసుకోనుండగా, డ్రాగన్ ఫ్రూట్‌కు మాత్రం అర ఎకరాన్ని పరిగణనలోకి తీసుకుంటారు.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాకు సంబంధించి వివిధ రకాల పండ్లతోటలు సాగు చేయించాలని ప్రభుత్వం నుంచి ఇప్పటికే ఆదేశాలు అందాయి. ఇందుకు అనుగుణంగా ఆసక్తి గల రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. రైతులు ఈ అవకావాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అన్ని పత్రాలతో ఉద్యానశాఖ, వ్యవసాయ విస్తరణాధికారులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలి.

– చంద్రశేఖర్ రావు, జిల్లా ఉద్యానశాఖ, పట్టు పరిశ్రమ అధికారి

మూడేళ్ల పాటు సంరక్షణ బాధ్యత

పండ్ల తోటల సంరక్షణ ఖర్చులు మూడేళ్లపాటు ప్రభుత్వమే భరించనుంది. మొక్కలు, ఎరువుల కొనుగోలు, నిర్వహణ, గుంతలు తీయటం, మొక్కలు నాటడం వంటి పనులకు అయ్యే ఖర్చు ఉపాధి హామీ పథకం ద్వారా చెల్లిస్తుంది. మామిడి ఒక్కో మొక్కకు రూ.30, బత్తాయికి రూ.44 ఇలా అన్ని మొక్కలను చెల్లించడమేకాక ఎరువు కోసం ఒక్కో మొక్కకు రూ.50, నిర్వహణ ఖర్చు నెలకు రూ.10 చొప్పున చెల్లిస్తారు. గుంతలు తీయడం, మొక్కలు నాటడం వంటి పనులన్నీ ఉపాధి హామీ కూలీలతో చేయించాల్సి ఉంటుంది. ఇవేకాక బిందు సేద్యం పరికరాలను కూడా రాయితీపై అందజేస్తారు. ఐదెకరాలలోపు భూమి కలిగి ఉండి, ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన రైతులను బిందు సేద్యం పథకంలో రాయితీకి అర్హులుగా నిర్ణయించారు. సాగునీటి వసతి కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై బిందు సేద్యం పరి కరాల పంపిణీ చేయనున్నారు.

క్లుప్తంగా

బతుకమ్మ ఆడుతూ మహిళ మృతి


లత(ఫైల్)

అచ్చంపేట రూరల్: పీర్ల పండుగ వేడుకల్లో మహిళ బతుకమ్మ ఆడుతూ మృతి చెందిన ఘటన మండలంలోని చెన్నారంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లత(35)కు బల్మూర్ మండలం కొండారెడ్డిపల్లికి చెందిన సైదులుతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. పీర్ల పండుగ సందర్భంగా ఆమె తల్లిగారి ఇంటికి వచ్చింది. శనివారం రాత్రి పీర్లచావిడి వద్ద మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ ఒక్కసారిగా కుప్పకూలింది. వెంటనే కుటుంబసభ్యులు అచ్చంపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆమె భర్త ఊరైన కొండారెడ్డిపల్లికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. ఆమెకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతు..

ధరూరు: పొలం వద్ద మోటరు ఆన్ చేసేందుకు వెళ్లిన ఓ రైతు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని వామన్‌పల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిన్న హనుమంతురెడ్డి(45) ఆదివారం ఉదయం పొలానికి నీళ్లు పారించేందుకు మోటరు ఆన్‌చేయడానికి వెళ్లాడు. స్టార్టర్ డబ్బా ఎర్త్ కావడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అతనికి భార్య, ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చస్తున్నట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు.


బ్లేడ్‌తో హత్యాయత్నం

చారకొండ: బ్లేడ్‌తో వ్యక్తి హత్యాయత్నం చేసిన ఘటన ఆదివారం చారకొండ మండలం చంద్రాయన్‌పల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఎం రవి వివరాల ప్రకారం.. చంద్రాయన్‌పల్లికి చెందిన శ్రీను, అదే గ్రామానికి చెందిన శివకు గతంలో రూ.5 వేలు అప్పుగా ఇచ్చాడు. స్నేహితుడు శ్రీశైలం బైక్‌పై శ్రీను శనివారం సాయంత్రం గోకారం గ్రామానికి చికెన్ కోసం వెళ్తున్నాడు. మార్గమధ్యలో శివ బైక్ ఆపి తాను వస్తానని బైక్ ఎక్కాడు. గోకారం వెళ్లి తిరిగి వస్తుండగా శివను తానిచ్చిన రూ.5వేలు ఇవ్వమని అడిగాడు. దీంతో శివ ఆగ్రహంగా 'అప్పు లేదు ఏమిలేదు' అని అసభ్యంగా మాట్లాడాడు. తన జేబులో నుంచి బ్లేడ్ తీసి శ్రీను గొంతుపై దాడి చేయబోయాడు. తప్పించుకోబోయిన శ్రీనుకు ముక్కుపై గాయాలయ్యాయి. వెంటనే బండి ఆపి వెళ్తుండగా, మార్గమధ్యలో గ్రామస్తులు ఎదురయ్యారు. దీంతో శివ నుంచి తప్పించుకొని ఆర్ఎంపీ డాక్టర్ దగ్గరికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. ఈ విషయంపై ఆదివారం చారకొండ పోలీస్ స్టేషన్‌లో శ్రీను ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మానవ అక్రమ రవాణా కట్టడి చేయాలి

మహబూబ్‌నగర్ క్రైం: మానవ అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రం లోని రైల్వే స్టేషన్‌లో ఆదివారం ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌పీఎఫ్ సీఐ సురేందర్‌గౌడ్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నయిముద్దీన్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. ప్రస్తుతం ఇది చాలా ప్రమాదకరంగా తయారైందన్నారు. ఎక్కడైనా పిల్లలు అనుమానాస్పదంగా కనిపించిన, ఇంట్లో నుంచి పారిపోయి వచ్చిన, బిక్షాటన చేస్తున్న చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సమాచారం ఇవ్వాలన్నారు. రైలులో ప్రయాణం చేసే ప్రయాణికులు ఏదైనా సమస్యలు గుర్తిస్తే రైల్వే హెల్ప్‌లైన్ 139 సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, వెంకటమ్మ, రాజనాయక్, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో ఒకే ఒక్కడు..


జడ్చర్ల పట్టణం వ్యూ..

- కమిషనర్ తప్పా.. అంతా ఔట్‌సోర్సింగ్‌లే..
- అధికారులు, సిబ్బంది లేక ఇబ్బందులు
- క్షేత్ర స్థాయి పర్యవేక్షణ లేక చిన్నాభిన్నం
- ఎక్కడి సమస్యలక్కడే.. పురవాసులకు తిప్పలే..


జడ్చర్ల మున్సిపాలిటీ కార్యాలయం

జడ్చర్ల: స్థానిక మున్సిపాలిటీలో కీలకమైన శాఖలకు సంబంధిత అధికారులు, ఉద్యోగ సిబ్బంది లేక సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. లక్ష జనాభా ఉన్న పట్టణంలో సకాలంలో సమస్యలు పరిష్కారం కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యమైన విభాలకు అధికారులు లేకపోవడంతో సమస్యలు పేరుకుపోతున్నాయి. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులకు ఇతర మున్సిపాలిటీలో బాధ్యతలు అప్పగించడంతో వారు వెళ్లిపోయారు. కమిషనర్ ఒక్కరే అన్నీ తానై చూస్తుండడంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కుంటుపడుతున్నాయి.

అన్ని పోస్టులు ఖాళీ..

మున్సిపాల్టీలో ప్రధాన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మేనేజర్‌గా ఉన్న నూరల్‌నజీబ్‌ను భూత్పూర్ మున్సిపాలిటీకి కమిషనర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వడంతో ఆయన అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. రెవెన్యూ అధికారిగా ఉన్న శశిధర్‌కు కోస్గి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు ఇవ్వడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. అభివృద్ధి పనుల ప్రతిపాదన, పర్యవేక్షణ, పనుల పరిశీలనకు ఇంజనీరింగ్ అధికారి పోస్టు లేకపోవడంతో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఏఈ నర్సింహులుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన మొక్కుబడిగా ఎప్పుడో ఒకసారి వచ్చిపోతుంటారు. గతంలో జడ్చర్ల మున్సిపాలిటీలో డిప్యూటీ ఇంజినీర్ పోస్టుతో పాటు రెండు ఏఈ పోస్టులుండేవి. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు కూడా లేదు. తాత్కాలికంగా నగేశ్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారి పోస్టు సైతం మంజూరు కాలేదు. ముడాలో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి మాత్రం ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించే పరిస్థితి నెలకొంది. క్షేత్ర స్థాయిలో టీపీబీఓ పర్యవేక్షణ లేకుండాపోయింది. రెండు సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

పట్టణంలో 27 వార్డులు..

జడ్చర్ల మున్సిపాలిటీలో 27 వార్డులున్నాయి. బాదేపల్లి, కావేరమ్మపేట(జడ్చర్ల)తో పాటు మున్సిపాలిటీ పరిధిలో విలీనమైన బూరెడ్డిపల్లి, నాగసాల, శంకరాయపల్లి తండాలున్నాయి. గ్రేడ్–2గా కొనసాగుతున్న ఈ మున్సిపాలిటీని గ్రేడ్–1గా మార్చాలన్న డిమాండ్ ఉంది. ఇంత ప్రాముఖ్యత కలిగిన మున్సిపాలిటీలో పూర్తి స్థాయిలో అధికారులు, సిబ్బంది లేక ఇబ్బందిగా ఉంది.

అంతా ఔట్ సోర్సింగ్ సిబ్బందే

జడ్చర్ల మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది దాదాపుగా అవుట్‌సోర్సింగ్ వారే ఉన్నారు. బాధ్యతా రహితంగా విధులు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. గతంలో వీఆర్‌ఓలుగా ఉన్న కొందరిని జూనియర్ అసిస్టెంట్లుగా నియమించారు. వారిని క్షేత్ర స్థాయిలో పన్ను వసూలు, తదితర సేవలకు వినియోగిస్తున్నారు.

కమిషనర్ ఒక్కరే ఆధారం..

మున్సిపాలిటీలో అన్నివిభాగాలకు సంబంధించి కమిషనర్ ఒక్కరే ఆధారమయ్యారు. ఆయనపై పని ఒత్తిడి, భారం పెరిగింది. దీంతో సకాలంలో సమస్యలపై స్పందించలేని పరిస్థితి ఏర్పడింది. అన్ని తానే చూడాల్సి రావడంతో కాలయాపన జరుగుతోంది. సకాలంలో సేవలు అందడంలేదని వాపోతున్నారు. మున్సిపాలిటీలో అన్ని విభాగాలకు పూర్తి స్థాయిలో అధికారులను, సిబ్బందిని నియమించాలని, ఆదిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, తదితర ఉన్నతాధికారులను ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకునే పరిస్థితి లేదు



మా కాలనీలో డ్రైనేజీ, రోడ్డు నిర్మాణం చేయాలని మూడేళ్లుగా కోరుతున్నాం. గతంలో చాలా సార్లు కమిషనర్ విజ్ఞప్తి చేశాం. ఏ అధికారి కూడా మా కాలనీని సందర్శించి పరిస్థితిని పరిశీలించిన పాపాన పోలేదు. పన్ను మాత్రం క్రమం తప్పకుండా వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా మా సమస్యలను పరిష్కరించాలి.

– లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర కాలనీ, జడ్చర్ల

సిబ్బంది కొరత ఉంది



మున్సిపాలిటీలో ఉద్యోగ సిబ్బంది కొరత ఉంది. ముఖ్యమైన విభాగాలకు అధికారులు లేకపోవడంతో అన్నీ నేనే చూసుకోవాల్సి వస్తోంది. సకాలంలో సమస్యలు పరిష్కరించలేని పరిస్థితి ఉంది. పర్యవేక్షణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు నియామకాలు చేయాల్సి ఉంది.

–మహ్మద్ షేక్, కమిషనర్, మున్సిపాలిటీ, జడ్చర్ల

భార్యాభర్తలను ఢీకొన్న వాహనం

- భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు

కొత్తకోట రూరల్: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యాభర్తలను బొలెరో వాహనం ఢీకొట్టడంతో భార్య మృతి చెంది, భర్తకు తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం నాటవెల్లి వద్ద జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి కతనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం మద్దూర్‌కు చెందిన రజియాబేగం, మహబూబల్ అలీ భార్యాభర్తలు. ఏడేళ్ల క్రితం కూతురు పాతిమాను కొత్తకోట మండలం పామాపురం గ్రామానికి చెందిన వలియోద్దీన్‌కు ఇచ్చి వివాహం చేశారు. వలియోద్దీన్ అనారోగ్యం వల్ల హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. కూతుర్ని ఓదార్చేందుకు ఆదివారం భార్యాభర్తలిద్దరు మద్దూర్ నుంచి పామాపురం ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. నాటవెల్లి సమీపంలో జాతీయ రహదారిని క్రాస్ చేస్తుండగా కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న బొలెరో వాహనం ఢీ కొట్టింది. దీంతో రజియాబేగం(50) అక్కడికక్కడే మృతి చెందగా, ఆమెభర్తకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో హైవే సిబ్బంది 108లో అతన్ని వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

కారు ఢీకొని మరొకరు..

గద్వాల క్రైం: కారు ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నదిఅగ్రహారానికి చెందిన తెలుగు ఆంజనేయులు (40) మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య రెండు రోజుల క్రితం పీర్ల పండుగకు ఇటిక్యాల మండలం ఆర్ గార్లపాడుకు వెళ్లింది. ఆదివారం ఉదయం పట్టణంలోని న్యూ హౌసింగ్ బోర్డు కాలనీలో పనికి వెళ్లాడు. సాయంత్రం భార్య, పిల్లలను తీసుకొచ్చేందుకు బైక్‌పై బయలుదేరాడు. గద్వాల రూరల్ పోలీసు స్టేషన్ సమీపంలో బైక్‌ను యూ టర్న్ చేస్తుండగా ఎర్రవల్లి వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడం అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదం అయిన వెంటనే కారు డ్రైవర్ తప్పించుకున్నట్లు పట్టణ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. అతని భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్లపైకి మొసళ్లు


కామధేనుపల్లి ఊరకుంట నుంచి రోడ్డుపైకి వచ్చిన మొసలి

వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నె రిజర్వాయర్‌కు అనుబంధంగా ఉన్న చెరువులు, కుంటల నుంచి రాత్రిళ్లు మొసళ్లు రోడ్లపైకి వస్తుండటంతో ద్విచక్ర వాహనదారులు, రైతులు భయాందోళనకు గురవుతున్నారు. గోవర్ధనగిరి గ్రామ కత్వా, కామదేనుపల్లి ఊరకుంట సమీపంలో రాత్రి వేళల్లో తరుచూ సంచరిస్తూ రోడ్డుపైనే వస్తుండటంతో ద్విచక్ర వాహనదారులు భయాందోళనకు గురై కింద పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందించడం లేదని గోవర్ధనగిరి, గోపల్‌దిన్నె, వీపనగండ్ల, రంగవరం గ్రామాల రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపైకి రాకుండా అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

వృద్ధురాలు ఆత్మహత్యాయత్నం


కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల సమీపంలో ఉన్న కృష్ణానది బ్యాక్ వాటర్‌లో మనస్తాపంతో రామలక్ష్మమ్మ నదిలో దూకింది. కుటుంబీకులు తెలిపిన ప్రకారం వివరాలు కొడేరు మండలం మైలారం చెందిన ఈమె తన కుమారుడు మందలించాడనే కోపంతో సోమశిలకు వచ్చే కృష్ణానదిలోకి దూకింది. గమనించిన మత్స్యకారులు వెంటనే స్పందించి ఆమెను ఒడ్డుకు తీసుకొచ్చారు. మద్యం మత్తులో చావడానికి వచ్చానని వృద్ధురాలు వారితో చెప్పింది. ఆమెను వెంటనే కొల్లాపూర్ సివిల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి అదుపులోనే ఉందని వైద్యులు తెలిపారు.

హైదరాబాద్‌లో అన్నదమ్ములు మృతి


మహేష్ (ఫైల్)

కొత్తకోట రూరల్: హైదరాబాద్‌లో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఆదివారం మండలానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పాలెం చెందిన చంద్రయ్య కుమారుడు జయకృష్ణ(12) శామీర్‌పేటలో గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. చంద్రయ్య సొంత అన్న జెనిగె రాములు కుమారుడు జనిగె మహేష్(20) హైదరాబాద్‌లోనే ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. జయకృష్ణను హాస్టల్ నుంచి బయటకు తీసుకొచ్చి తిరిగి హాస్టల్‌లో వదిలేందుకు జయకృష్ణ తనకు చెందిన బైక్‌పై వెళ్తుండగా బాబాగూడ సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన గల కరెంట్ స్తంభానికి ఢీకొట్టింది. జయకృష్ణ, జనిగె మహేష్ అక్కడికక్కడే మృతి చెందారు. స్థానిక పోలీసుల ద్వారా సమాచారం తెలుసుకున్న మృతుల కుటుంబ సభ్యులు హుటాహుటిన హైదరాబాద్‌కు వెళ్లారు.

శాంతించిన కృష్ణమ్మ


జూరాల ప్రాజెక్టు వద్ద ఆరు గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న వరద నీరు

- జూరాలకు తగ్గి, స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో
- జెన్‌కోలో ఆరు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ధరూరు/దోమలపెంట/ మదనాపురం/ ఆత్మకూర్: మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లోలు తగ్గుముఖం పట్టాయి. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గడంతో ఆదివారం ఉదయం తెరిచి ఉంచిన 25 క్రస్టు గేట్లను మూసివేశారు. ఉదయం 7 గంటలకు 1,58,655 క్యూసెక్కులు ఉండగా, 9గంటలకు 37వేల క్యూసెక్కులకు తగ్గిపోయింది. సాయంత్రం 5 గంటలకు ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగి 66,500 క్యూసెక్కులు పెరిగింది. రాత్రి 8 గంటల వరకు వరకు 68,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో మూసి ఉంచిన గేట్లలో ఆరింటిని తెరిచి 23,184 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. ఇదిలా ఉండగా జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో ఆరు యూనిట్లలో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఇందుకోసం ప్రాజెక్టు నుంచి 41,242 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. జూరాల ఆరుగ గేట్ల ద్వారా 1,23,184 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 76క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 640, సమాంతర కాల్వకు 850, భీమా లిఫ్ట్–1కు 650, లిఫ్ట్–2కు 850 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి 44,218 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు వైపు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.079 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల వద్ద వరద

ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు ప్రస్తుతం 1,36,734 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 62,400క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 129.72 టీఎంసీలు కాగా, 98.289 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 37.64 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 29.27 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 57వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి 42,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

శ్రీశైలానికి తగ్గిన ప్రవాహం



ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలానికి వస్తున్న వరద ప్రవాహం ఆదివారం తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 41,252, సుంకేసుల నుంచి 1,310 కలిపి 42,562 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలానికి వస్తుంది. 24 గంటల వ్యవధిలో 2,26,105 క్యూసెక్కుల నీరు జలాశయానికి చేరింది. దీంతో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం శ్రీశైలంలో 846.7 అడుగుల వద్ద 73.2 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.8 టీఎంసీలు.

నిండుగా రామన్‌పాడు

మదనాపురం మండలంలోని రామన్‌పాడు జలాశయానికి వరద కొనసాగుతుంది. ఆదివారం ఊకచెట్టు పెద్దవాగు, చిన్నవాగు ద్వారా వరద వచ్చింది. అధికారులు గేటు ఎత్తి 24 గంటల పాటు 500 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 1,021.6 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 640 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 500, కుడి కాల్వ ద్వారా 10, ఎడమ కాల్వ ద్వారా 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రనిల్‌రెడ్డి తెలిపారు.



ఆర్థిక వ్యవస్థకు ఆధ్యుడు పీవీ

- ఎమ్మెల్సీ, పీవీ కుమార్తె సురభి వాణీదేవి


పీవీ నరసింహారావు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ వాణీదేవి, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తదితరులు

కందనూలు: దేశ ఆర్థిక వ్యవస్థకు ఆధ్యుడు పీవీ నరసింహారావు అని ఎమ్మెల్సీ, పీవీ కుమార్తె సురభి వాణీదేవి అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని హౌసింగ్‌బోర్డుకాలనీలో స్వర్గీయ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, పీవీ కుమారుడు ప్రభాకర్‌రావు, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్ శర్మ, బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు జోషి గోపాల శర్మతో కలిసి ఆమె ఆవిష్కరించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పుర పరిధిలోని ఉయ్యాలవాడ సమీపంలోని సుఖజీవన్‌రెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించిన బ్రాహ్మణ అత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రమాదంలో పడినప్పుడు ప్రధానిగా పీవీ నరసింహారావు బాధ్యతలు స్వీకరించి అనేక ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం నేటికీ పీవీ సంస్కరణలే అమలు చేస్తోందని.. దేశానికి దిశ, దశ చూపిన పీవీ సంస్కరణలే ఆర్థిక వృద్ధికి ఊతమిస్తున్నాయని తెలిపారు. అలాంటి మహనీయుడు మన రాష్ట్రంలో పుట్టడం గర్వకారణమని.. ఆయన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం గర్వంగా ఉందని చెప్పారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ ప్రధానిగా పనిచేసిన మొట్టమొదటి, ఏకైక తెలంగాణ వ్యక్తి పీవీ నరసింహారావు కావడం హర్షించదగ్గ విషయమన్నారు. సంస్కరణల రూపంలో ఆయన ఎప్పుడూ మన మధ్యే ఉంటున్నారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పీవీ శతజయంతి వేడుకలను ఏడాది పాటు నిర్వహించి ఘన నివాళులర్పించిన సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. పీవీ కుమారుడు ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. ఆయన వారసుడిగా పుట్టడం గర్వంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన, జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రఘునాథ్‌రావు, ప్రధానకార్యదర్శి దుర్గి శ్రీకాంత్ శర్మ, సభ్యులు ఇంద్రకంటి పవన్‌కుమార్, దిలీప్‌రావు, భరత్, జగన్‌మోహన్‌రావు, పలువురు ప్రజాప్రతినిధులు, బ్రాహ్మణ సంఘం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సందర్శకులతో జూరాల కిటకిట


జూరాల ప్రాజెక్టుపై సందర్శకులు


రిజర్వాయర్ దిగువన సందర్శకుల సందడి

ధరూరు/అమరచింత: సందర్శకులతో జూరాల ప్రాజెక్టు పరిసరాలు కిటకిటలాడాయి. ఆదివారం కావడం, ప్రాజెక్టుకు వరద ప్రవాహం ఉండడంతో ఉమ్మడి జిల్లా వాసులతో పాటు కర్ణాటక నుంచి సందర్శకులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఉదయం నుంచి ప్రాజెక్టు వద్ద గద్వాల, వనపర్తి జిల్లాలకు చెందిన పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ప్రమాదభరిత ప్రాంతాలకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. ఎడమ కాల్వ వద్ద చేపల వంటకాలను ఆరగించి తమ ప్రాంతాలకు తిరిగి వెళ్లారు.


చేప వంటకాల దుకాణాల వద్ద పర్యాటకులు


పిల్లలతో కలిసి సెల్ఫీ తీసుకుంటున్న తండ్రి


జూరాల ప్రాజెక్టుపై రద్దీ

క్లుప్తంగా...

అగ్నిగుండంలో దూకి.. వ్యక్తి ప్రాణాలు కాపాడి!

- అన్నమయ్య జిల్లాలో ఓ వలంటీర్ సాహసం


చికిత్స పొందుతున్న కల్లూరి బాషా


గాయాలపాలైన వలంటీర్ సురేష్

రైల్వేకోడూరు: అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలంలోని ఓ.కొత్తపల్లిలో శనివారం రాత్రి పీర్ల చావిడి వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో కల్లూరి బాషా అనే వ్యక్తి ప్రమాదవశాత్తు పడిపోయాడు. అక్కడే ఉన్న వలంటీర్ చాపల సురేష్ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా గుండంలో దిగి బాషా ప్రాణాలు కాపాడాడు. ఈ సంఘటనలో బాషా వీపు భాగం బాగా కాలిపోవడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. వలంటీర్ కాళ్లు కాలిపోవడంతో కోడూరులో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నాడు. పీర్లచావిడి అగ్నిగుండం వద్ద జరిగిన ఈ సంఘటనను వందలాది మంది చూస్తున్నారే తప్ప బాషా ప్రాణాలను కాపాడేందుకు ఎవ్వరూ ముందుకు రాలేకపోయారు. కానీ వలంటీర్ సురేష్ సాహసం చేసి గుండంలో పడిపోయిన బాషా ప్రాణాలు కాపాడి అందరి మన్ననలు పొందాడు.

రొట్టె పట్టగా.. కోర్కె తీరగా..!

- కొనసాగుతున్న రొట్టెల పండగ




సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరులోని బారాషహీద్ దర్గా వద్ద నిర్వహించే రొట్టెల పండగ ఆదివారం వేడుకగా కొనసాగింది. కోర్కెల రొట్టెలను పట్టుకునేందుకు లక్షలాదిగా రావడంతో రొట్టెలు మార్చుకునే భక్తులతో స్వర్ణాల చెరువు జనసంద్రమైంది. అక్కడ స్నానమాచరించి కోర్కెల రొట్టెలను పట్టుకున్నారు. అర్ధరాత్రి తర్వాత దర్గా ప్రాంగణంలో గంధ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గంధాన్ని షహీదుల సమాధులకు సమర్పించి భక్తులకు పంచిపెట్టారు. రొట్టెల పండగకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు వచ్చారు.

భూగోళం.. ఇక మండే అగ్నిగోళం

గ్లోబల్ వార్మింగ్ యుగం ముగిసింది

- బాయిలింగ్ యుగం మొదలైంది.. ప్రపంచానికి ఐక్యరాజ్యసమితి హెచ్చరిక
- జూలైలో ప్రపంచవ్యాప్తంగా రికార్డు ఉష్ణోగ్రతలు నమోదు
- 1.20 లక్షల సంవత్సరాల్లో ఎన్నడూ లేనంతగా పెరిగిన ఉష్ణోగ్రతలు
- హీట్‌వేవ్‌ను ఎదుర్కొన్న ఐరోపా దేశాలు.. ఉష్ణోగ్రతల కట్టడికి ఐరాస చర్యలు



సాక్షి, అమరావతి: భూగోళం మండే అగ్నిగోళంగా మారుతోంది. శీతల దేశాల్లో సూర్యుడు సెగలు పుట్టిస్తున్నాడు. ఎండల ధాటికి ఓ వైపు అడవులు దగ్ధమైపోతుండగా.. మరోవైపు మంచు కరిగిపోయి వరదలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. గ్లోబల్ వార్మింగ్ యుగం ముగిసిపోయిందని.. ఇక గ్లోబల్ బాయిల్ యుగం వచ్చేసిందని ఐక్యరాజ్యసమితి సైతం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇందుకు తగ్గట్లుగానే ఈ ఏడాది జూలైలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని యూరోపియన్ కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్, ప్రపంచ వాతావరణ సంస్థ వెల్లడించాయి. సాధారణంగా జూలైలో ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 16 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యేదని.. కానీ, ఈ ఏడాది దాదాపు 17 డిగ్రీలకు పెరిగిందని వెల్లడించాయి. 1.20 లక్షల సంవత్సరాల్లో భూమి ఇంత వేడిని ఎప్పుడూ చూడలేదని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. దక్షిణ అర్ధగోళంలో విపరీత వేడి కారణంగా మంచు కరిగి వరదలు విధ్వంసం సృష్టిస్తున్నాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అలాగే చైనా, దక్షిణ కొరియా, బ్రెజిల్, అమెరికా ఈశాన్య ప్రాంతాలు, జపాన్, భారత్, పాకిస్తాన్‌లో ఆకస్మిక వరదలు సంభవిస్తాయని వారు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా ఎడారి ప్రాంతాల్లో పగటిపూటతో పోలిస్తే రాత్రి సమయాల్లో వాతావరణం కాస్త చల్లబడుతుంది. కానీ, కాలిఫోర్నియాలోని 'డెత్ వ్యాలీ'లో రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు. అక్కడ జూలై నెలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యా యని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అలాగే వాయవ్య చైనాలోనూ రికార్డు స్థాయిలో 52.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు ఉత్తరార్ధ గోళంలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది వేసవిలో వడగాడ్పులు వీచాయి. ఫలితంగా అంటార్కిటికాలో కూడా పెద్ద ఎత్తున మంచు కరిగిపోయింది. అలాగే ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీ, పోలాండ్ దేశాలను వడగాడ్పులు ఉక్కిరిబిక్కిరి చేశాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

పొంచి ఉన్న కరువు ముప్పు..!

దక్షిణ ఐరోపా, ఉత్తర ఆఫ్రికా, ఆసియా దేశాలు వసంత కాలం చివరి నుంచి అత్యధిక వేడిని ఎదుర్కొన్నాయని యూరోపియన్ కోపర్నికస్ నివేదిక చెబుతోంది. అమెరికాలోని దక్షిణ రాష్ట్రాల్లో క్రమం తప్పకుండా 37 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వివరించింది. గ్రీస్, ఇటలీ, క్రొయేషియా, అల్జీరియా, కెనడాలో కార్చిచ్చులు చెలరేగి అడవులను దహించాయి. నాడాలో ఏకంగా నాలుగు వారాల్లో 46 వేల చదరపు మైళ్ల అడవులు బూడిదయ్యాయి. 60 శాతం దేశాల్లోని అడవుల్లో మంటలు చెలరేగాయని నివేదిక తెలిపింది. వీటి ఫలితంగా 1950తో పోలిస్తే ప్రపంచ భూభాగంలో దాదాపు మూడో వంతు ఏటా కరువు సంభవిస్తుందని.. ఇది 10 లక్షల మందిని తీవ్ర ఆకలిలోకి నెడుతుందని శాస్త్రవేత్తల నివేదికలు హెచ్చరిస్తున్నాయి. ఈ ఏడాది చివరితో పాటు 2024లో ఎల్‌నినో ప్రభావం గరిష్ఠ స్థాయికి చేరుకుంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఫలితంగా బ్రిటన్, ఐర్లాండ్, బాల్టిక్ సముద్రం, జపాన్ సముద్రం, పసిఫిక్, పశ్చిమ హిందూ సముద్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఉపరితల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముంది. కాగా, ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్ మేర కట్టడి చేసేందుకు ప్రపంచ దేశాలతో కలిసి ఐక్యరాజ్యసమితి చర్యలు చేపడుతోంది.

కోటికి చేరువలో 'జగనన్న సురక్ష'

నేటితో ముగియనున్న కార్యక్రమం

సాక్షి, అమరావతి: ఏపీలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా నెల రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 1.38 కోట్ల కుటుంబాలను ఇంటి వద్ద కలుసుకోవడం ద్వారా పెండింగ్ సమస్యలు లేకుండా అధికార యంత్రాంగం ప్రతి ఇంటినీ జల్లెడ పట్టింది. జూన్ 23వ తేదీన సీఎం జగన్ మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించిన ఈ కార్యక్రమం నేటితో (జూలై 31వ తేదీ) ముగియనుంది. రాష్ట్రవ్యాప్తంగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా శనివారం నాటికే 15,002 సచివాలయాల వద్ద మండల స్థాయి అధికారుల స్థాయిలో ప్రత్యేక వినతుల పరిష్కార క్యాంపులు పూర్తయ్యాయి. సోమవారం మిగిలిన 2 సచివాలయాల వద్ద క్యాంపులు కొనసాగుతాయని సచివాలయాల శాఖ అధి కారులు వెల్లడించారు. విద్యాసంస్థల్లో అడ్మిషన్లు జరుగుతున్న తరుణంలో విద్యార్థులకు అవసర మయ్యే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు మొత్తం 11 రకాల ధ్రువీకరణ పత్రా లను ఈ క్యాంపుల ద్వారా ఎలాంటి సరీస్ చార్జీలు లేకుండా ఉచితంగా అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 59 లక్షల కుటుంబాలకు చెందిన దాదాపు కోటి మందికి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రయోజనం చేకూర్చారు. 99.80 లక్షల టోకెన్లు జారీ కాగా క్యాంపులు జరిగిన రోజు అధికారుల వద్దకు 95.96 లక్షల వినతులు ప్రస్తావనకు వచ్చాయి. ఇందులో 92.97 లక్షల వినతులను అధికారులు అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలినవి వివిధ దశల్లో పరిశీలన కొనసాగుతోంది.

29 ఏళ్లుగా వేధిస్తున్నారు..

- మాజీమంత్రి నారాయణపై రాయదుర్గం పీఎస్‌లో కృష్ణప్రియ పొంగూరు ఫిర్యాదు
- బావ నారాయణ, భర్త మణి అరాచకాలకు పాల్పడ్డారు
- పెళ్లి అయిన రెండో రోజు నుంచే నారాయణ సాధింపు
- లొంగకపోవడంతో వేధింపులు
- నారాయణపై మరోసారి ఆయన మరదలు తీవ్ర ఆరోపణలు



గచ్చిబౌలి (హైదరాబాద్): ఏపీ మాజీమంత్రి పొంగూరు నారాయణపై ఆయన తమ్ముడు సుబ్రహ్మణ్యం భార్య కృష్ణప్రియ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 29 ఏళ్లుగా నారాయణ, భర్త సుబ్రహ్మణ్యం అలియాస్ మణి తనను మానసికంగా, లైంగికంగా వేధిస్తున్నారని ఆదివారం ఉదయం రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న తాను ఎదుర్కొన్న అనుభవాలను పోస్టు చేశానని, రాజకీయంగా వారికి ఇబ్బంది కలుగుతోందని భావించి తన ఇన్‌స్టాగామ్ అకౌంట్‌ను మూసివేశారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం గచ్చిబౌలిలోని బాంబూస్ మీనాక్షి విల్లాస్ ఎదుట కృష్ణప్రియ మీడియాతో మాట్లాడారు. ఆమె ఏమన్నారంటే.. పెళ్లైన రెండో రోజు నుంచే బావ నారాయణ లైంగిక వేధింపులు మొదలుపెట్టాడు. ఆయనకు లొంగకపోవడంతో 29 ఏళ్లుగా ఆయన పెట్టే బాధలు భరిస్తున్నాను. ఆయన స్త్రీలోలుడు. నారాయణ విద్యా సంస్థల్లో పనిచేసే కొందరు మహిళలు ఆయన దగ్గరకు వెళ్లాల్సిందే. సోదరి వరుసైన వారు స్నానం చేస్తున్నప్పుడు బాత్‌రూమ్‌లోకి తొంగి చూసేవాడు. ఈ విషయం మొదట్లో వాళ్ల వాళ్లే చెప్పారు. నేను లొంగకపోవడంతో వేధింపులు ప్రారంభించాడు. నాకు మానసిక సమస్య ఉన్నట్లుగా నా భర్త తప్పుడు సర్టిఫికెట్లు చూపించి యూట్యూబ్ వేదికగా ప్రచారం చేయడం చాలా బాధేసింది. నారాయణ మెడికల్ కాలేజీలో పనిచేసే డాక్టర్ శేషమ్మ నుంచి మెడికల్ సర్టిఫికెట్ తీసుకురావడం వారికి పెద్ద సమస్య కాదు. అలాగే, నారాయణ పిల్లలకు మానసిక సమస్యలు ఉన్నాయి. డాక్టర్ విరించి వారికి చికిత్స చేస్తున్నారు. విరించి నుంచి కూడా సర్టిఫికెట్ తేవడం పెద్ద కష్టమేమి కాదు. ఒకరోజు మా నాన్నపై అరుస్తుంటే గుంటూరులో ఓ డాక్టర్ వద్దకు తీసుకెళ్లారు. నిద్రలేమితో నిద్రమాత్రలు వేసుకుంటున్నట్లు డాక్టర్‌కు చెప్పాను. మానసిక ఒత్తిడితోనే నిద్రలేమి సమస్య ఉండవచ్చని డాక్టర్ చెప్పారు. నేను ఇటీవల ఏఐజీ ఆస్పత్రిలో చేరిన విషయం నిజమే. ఇక రక్త సంబంధం ఉంది కాబట్టే నారాయణకు నా భర్త పెట్‌గా మారాడు.

కేసు నమోదు చేయలేదు : సీఐ

మరోవైపు.. కృష్ణప్రియ ఫిర్యాదును పరిశీలిస్తున్నామని, ఇప్పటివరకు ఎలాంటి కేసు నమోదు చేయలేదని రాయదుర్గం సీఐ మహేష్ తెలిపారు.

మానసిక స్థితి బాగోలేదంటూ వీడియోలు

- కృష్ణప్రియపై వీడియో విడుదల చేసిన ఆమె భర్త సుబ్రహ్మణ్యం
- నారాయణ పన్నాగంపై నెటిజన్లు, మహిళా సంఘాల మండిపాటు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ మాజీమంత్రి పొంగూరు నారాయణ చీకటి బాగోతాన్ని బయటపెట్టి సంచలనం సృష్టించిన అతని మరదలు కృష్ణప్రియ మానసిక పరిస్థితి బాగోలేదంటూ ఆమె భర్త సుబ్రహ్మణ్యం తాజాగా విడుదల చేసిన ఓ వీడియో వైరల్‌గా మారింది. నారాయణ వికృత చేష్టలను సోషల్ మీడియా వేదికగా ప్రియ గత నాలుగు రోజులుగా వెలుగులోకి తెస్తున్న విషయం తెలిసిందే. ఈ ఘటనపై మహిళా సంఘాలు మండిపడుతున్నాయి. రాజకీయ వర్గాలు కూడా నారాయణ చేష్టలను అసహ్యించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పరువుపోయిన నారాయణ కృష్ణప్రియపై ఓ పథకం ప్రకారం ఆమె మానసిక స్థితి బాగోలేదని ముద్రవేయించేలా చేశారు. ఇందులో భాగంగా.. కృష్ణప్రియ భర్త అయిన తన సోదరుడు సుబ్రమణ్యంతోనే ఆమె మానసికస్థితి బాగోలేదని, అందుకే అలా మాట్లాడుతోందని.. తన భార్య మాటలు ఎవరూ పట్టించుకోవద్దంటూ వీడియో రిలీజ్ చేయించి సోషల్ మీడియాలో విడుదల చేశారు. కానీ, నారాయణ పన్నాగంపై నెటిజన్లు, మహిళా సంఘాల నేతలు మండిపడుతున్నారు. ఇదిలా ఉంటే.. పెళ్లయిన నాటి నుంచి కృష్ణప్రియను మానసికంగా, శారీరకంగా వేధించడంవల్లే ఆమె మానసిక పరిస్థితి సరిగా లేకుండాపోయిందని ఆమె కుటుంబసభ్యులు చెబుతున్నారు.

నారాయణపై చర్యలు తీసుకోవాలి..

మహిళలను వేధించే వారు ఏ స్థాయిలో ఉన్న వ్యక్తులైనా సరే వారిపై చర్యలు తీసుకోవాల్సిందే. నారాయణ తన సోదరుడి భార్యను మానసికంగా, శారీరకంగా వేధించడం బాధాకరం. ఎందరికో విద్యాబుద్ధులు నేర్పే గౌరవప్రదమైన వృత్తిలో ఉన్న వ్యక్తి మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం సిగ్గుచేటు. నారాయణపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి.

– పాల జ్యోతి, మహిళా సంఘం నాయకురాలు, నెల్లూరు

నీట మునిగిన సంగమేశ్వరుడు


సంగమేశ్వరాలయంలోకి చేరుకున్న కృష్ణమ్మ నీళ్లు

కొల్లాపూర్: సోమశిల సమీపంలోని కృష్ణానదికి ఆవలి ఒడ్డున వెలసిన సంగమేశ్వర ఆలయం నీటిలో మునిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భూభాగంలో ఉన్న ఈ ఆలయం కృష్ణానది నిండుగా ఉన్నప్పుడు మునిగిపోతుంది. నీళ్లు తగ్గాక తేలుతుంది. ఆరు నెలలుగా భక్తులతో పూజలు అందుకున్న ఆలయం చుట్టూ శనివారం రాత్రి నీళ్లు చేరుకున్నాయి. అర్చకులు సంగమేశ్వరునికి పూజలు నిర్వహించి, ఆలయం మూసివేశారు. ఆదివారం ఉదయం గుడి సగభాగం వరకు నది నీళ్లలో మునిగిపోయింది. సోమశిల సమీపంలో ఉండే పాత మసీదు చుట్టూ కూడా నీళ్లు చేరుకున్నాయి. వరద ప్రవాహం ఇలాగే కొనసాగితే మరికొన్ని రోజుల్లో సంగమేశ్వరాలయం, మసీదు రెండూ నీటిలో మునిగిపోతాయి.

పార్టీలకు కొమ్ము కాయొద్దు

- దండోరా ఉద్యమం కోసం పనిచేయండి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ


మాట్లాడుతున్న మందకృష్ణమాదిగ

జడ్చర్ల: మాదిగలు జాతి, వర్గీకరణ కోసం దండోరా ఉద్యమానికి సమయం వెచ్చించి చిత్తశుద్ధితో పని చేయాలని, రాజకీయ పార్టీల జెండాలు మోస్తూ సమయాన్ని వృథా చేయొద్దని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా విశ్వరూప మహాసభ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వచ్చే నెలలో నిర్వహించే మహాసభకు భారీ సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. 1994లో ప్రారంభమైన ఎమ్మార్పీఎస్ వర్గీకరణ ఉద్యమం 29 ఏళ్ల పాటు సాగిన ప్రస్థానాన్ని ఆయన వివరించారు. 1997లో సాధించుకున్న వర్గీకరణ ఫలితంగా 22వేల ఉద్యోగాలు మాదిగ యువత పొందగలిగారని, తర్వాత సుప్రీం కోర్టులో మాల కులానికి చెందిన ఓ జడ్జీ తీర్పు వలన వర్గీకరణ బిల్లు రద్దయ్యిందన్నారు. అప్పటి నుంచి మళ్లీ వర్గీకరణ కోసం ఉద్యమాన్ని ఉధృతం చేశామన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ హయాంలో వర్గీకరణ కోసం అది నాయకత్వం అనుకూలంగా ఉన్నా మాల కులానికి చెందిన ఐఏఎస్, ఇతర అధికారులు లాబీయింగ్ చేసి బిల్లు పెట్టకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో ఎమ్మార్పీఎస్ కీలకంగా వ్యవహరించి కేసీఆర్‌కు సహకరించామని గుర్తు చేశారు. వర్గీకరణ కోసం అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామని అసెంబ్లీలో ప్రకటించిన సీఎం కేసీఆర్ తర్వాత ఆలస్యం చేయడాన్ని ప్రశ్నించినందుకు జైలుకు పంపి బెయిల్ రాకుండా అడ్డుకున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఒక్క మాదిగ మంత్రి లేరని, తక్కువ జనాభా ఉన్న వారందరికి పరిమితికి మించి మంత్రులు ఉన్నారని తెలిపారు. ఉన్నత స్థానాలలో మాదిగ అధికారులు లేకపోవడం కూడా ఉద్యమానికి ఇబ్బందిగా మారిందన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ ఎవరు అధికారంలోకి వచ్చినా మాదిగలకు ఒరిగేదేమీ లేదన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే మళ్లీ మూడో సారి కేసీఆర్ లేక ఆయన కుమారుడు కేటీఆర్ సీఎం అవుతారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రేవంత్‌రెడ్డి లేదా మాల కులానికి చెందిన మల్లు భట్టి విక్రమార్క సీఎం అవుతారే తప్ప మాదిగల వర్గీకరణకు పాటుపడే వారు కారన్నారు. బీజేపీ వచ్చినా ఇదే పరిస్థితి ఉంటుందన్నారు. ఇటీవల వరంగల్ సభకు ప్రధాని మోడీ వచ్చిన సందర్భంలో మంత్రి కిషన్‌రెడ్డి సాక్షిగా వర్గీకరణకు అనుకూలంగా ప్రధాని హామీ ఇచ్చారని అన్నారు. ఒక్కసారి వర్గీకరణ సాధించుకుంటే తరతరాలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో మాదిగలకు సరైన న్యాయం లభిస్తుందన్నారు. బిల్లు పెట్టేందుకు ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి జిల్లా నాయకత్వంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలకు సమయం ఇస్తున్నంతగా ఉద్యమం కోసం సమయం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో జంగయ్య, యాదయ్య, రాజు, నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పరుసవేదీశ్వర ఆలయాభివృద్ధికి కృషి చేస్తా..

- ఏపీ స్టేట్‌ట్యాక్స్ చీఫ్ కమిషన్ జనరల్ గిరిజాశంకర్


ఆలయంలో పూజలు చేస్తున్న స్టేట్‌ట్యాక్స్ చీఫ్ కమిషనర్ గిరిజాశంకర్

జడ్చర్ల టౌన్: మండలంలోని మీనాంబరం పరుసవేదీశ్వర ఆలయాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఏపీ స్టేట్‌ట్యాక్స్ చీఫ్ కమిషనర్ గిరిజాశంకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ పురోహితులు, అభివృద్ధి కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. గతంలో ఆలయ ధ్వజస్తంభానికి వెండి తొడుగును హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ శ్రీరాములు యశోద దంపతులు బహూకరించారు. దానికి సంబంధించిన పనుల పురోగతిని తెలుసుకునేందుకు వారితో కలసి ఆయ న ఆలయాన్ని సందర్శించారు. తాను మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో ఆలయం గూర్చి తెలుసుకున్నానని, ఎంతో ప్రాచీనమైన ఆలయం దినదినాభివృద్ధి చేయడం సంతోషంగా ఉందన్నారు. దేవాదాయశాఖ ద్వారా అవసరమైన నిధులు వచ్చేలా కృషి చేస్తానన్నారు. ఈ విషయంపై ప్రస్తుత కలెక్టర్ రవినాయక్‌తో మాట్లాడతానని అభివృద్ధి కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బాలానగర్ డిప్యూటీ తహసీల్దార్ దేవేందర్, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోపాల్, సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, వడ్డె యాదయ్య, దామోదర్, కైలాష్ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలి


చిన్నరేవల్లిలో ప్రజలకు అభివాదం చేస్తున్న అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: కేంద్రం, రాష్ట్రంలో ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలకు రాబోయే ఎన్నికలలో బుద్ధి చెప్పాలని టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో చేపట్టిన ప్రజాహిత పాదయాత్ర ఆదివారం బాలానగర్ మండలం నుంచి జడ్చర్ల మండలంలోకి ప్రవేశించింది. మూలస్తంభంతండా, ఎక్వాయపల్లి, పెద్ద ఆదిరాలలో పాదయాత్ర కొనసాగింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌తో పాటు పెంచిన పింఛన్లను అందజేస్తామన్నారు. మహిళలకు రూ.500కే వంటింటి సిలిండర్‌ను ఇస్తామని, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి ఆర్థికసాయం అందించడంతో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే ప్రజల సంక్షేమం..

బాలానగర్: కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దరేవల్లి మీదుగా ప్రారంభమైన ప్రజాహిత పాదయాత్ర ఆదివారం చిన్నరేవల్లి మీదుగా జడ్చర్ల మండలం బోజ్యానాయక్ తండా, ఎక్వాయపల్లికి చేరింది. ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 ఏళ్లు గడిచినా పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదన్నారు. ధరణి పోర్టల్‌తో రైతుల భూముల కష్టాలు తప్పలేదన్నారు. వాటిని సరిచేసుకోవడానికి రైతులు రూ.వేలు ఖర్చు చేసుకోవాల్సి వస్తుందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో నీళ్లు, నిధులు, నియామకాలు అన్నీ కేసీఆర్ కుటుంబానికే దక్కాయన్నారు. నియోజకవర్గంలో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే కళాశాలలకు వెళ్లే విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బూట్లు పంపిణీ చేస్తామన్నారు. గ్రామాల్లో వలంటీర్లను నియమించి గ్రామస్తుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో శంకర్ నాయక్, బద్రునాయక్, రఫీక్, బాబు, నవీన్ రెడ్డి, మహేందర్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అకునూరి మురళీ

- రిటైర్డ్ ఐఏఎస్ అకునూరి మురళీ

గద్వాల అర్బన్: విద్యతోనే సమాజాభివృద్ధి అవుతుందని, తెలంగాణలో విద్య వ్యవస్థ ధ్వంసమైందని సోషల్ డెమోక్రటిక్ ఫోరం రాష్ట్ర కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ అకునూరి మురళీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో తెలంగాణలో 'సదువు ఎట్లుంది.. ఎట్లుండాలె' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రిటైర్డ్ ఐఏఎస్ అకునూరి మురళీతో పాటు సోషల్ డెమోక్రటిక్ ఫోరం కో కన్వీనర్ సంగంరెడ్డి పృథ్వీరాజ్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సమాజాభివృద్ధికి విద్య పునాదిలాంటిదన్నారు. తెలంగాణలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో మౌళిక వసతులు లేక అస్తవ్యస్తంగా మారిందన్నారు. కోఠారి నివేదిక కమిషన్ ప్రకారం బడ్జెట్‌లో విద్యకు 20 శాతం నిధులు కేటాయించాలని, ప్రభుత్వం కేవలం 6.4 శాతం నిధులు మాత్రమే కేటాయిస్తుందన్నారు. విద్య వ్యవస్థ మార్పుకోసం పోరాటం చేస్తే నూతన విద్య విధానం అమలవుతుందన్నారు. సమావేశంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి కన్వీనర్ బుచ్చిబాబు, తిమ్మప్ప, విజయన్న, వీరేష్, నాగేష్, ఆవనిశ్రీ, రంగస్వామి, రాముడు పాల్గొన్నారు.

పాత పెన్షన్ సాధన కోసం పోరాటం

- సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పాత పెన్షన్ సాధించడం కోసం సీపీఎస్ ఉద్యోగులందరు కలిసికట్టుగా పోరాటానికి సిద్ధం కావాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ అన్నారు. పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రలో భాగంగా ఆదివారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి ప్రారంభమైన ర్యాలీ మెట్టుగడ్డ, క్లాక్ టవర్ వరకు నిర్వహించారు. అనంతరం గడియారం చౌరస్తాలో ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం అమలు చేసేదాక పోరాటం చేయాలని అన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులందరూ ఆగస్టు 12న చలో హైదరాబాద్ కార్యక్రమానికి భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. టీజీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నాయక్, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నారాయణగౌడ్, తపస్ జిల్లా అధ్యక్షుడు సునీల్, ఎస్టీయూ నాయకులు వెంకటేష్, యూటీఎఫ్ నాయకులు భాస్కర్, టీటీయూ జర్రు నారాయణ, క్లాస్ ఫోర్త్ ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షుడు నరేందర్ సీపీఎస్ పోరాటానికి మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు సనాతన బాలస్వామి, కోశాధికారి నరేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, కోశాధికారి రాఘవేంద్ర, మురళిముదిరాజ్, పాధ్యాయులు పాల్గొన్నారు.


గడియారం చౌరస్తాలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ